క్లుప్తంగా

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

వాంకిడి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏడీఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే కార్యక్రమానికి సీజీఆర్ఎఫ్ చైర్మన్ రామకృష్ణ, ఫైనాన్స్ మెంబర్ కిషన్, ఫోర్త్ మెంబర్ రాజారెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. వాంకిడితో పాటు ఆసిఫాబాద్ టౌన్, ఆసిఫాబాద్ రూరల్, రెబ్బెన మండలాల వినియోగదారులు సదస్సును సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

లింగాపూర్: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ పనులపై 4వ విడత ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామేశ్వర్ తెలిపారు. ఈ ప్రజావేదికకు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూలీలు హాజరు కావాలని సూచించారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న అధికారులు

కౌటాల: మండలంలోని పార్డీ గ్రామానికి చెందిన ఎకోన్‌కార్ పుష్పబాయికి మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పలత రూ. 2లక్షల బీమా చెక్కు అందజేశారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకంలో బీమా చేసుకోవాలన్నారు. టీజీబీ మేనేజర్ అజేశ్‌కుమార్ గేరా, ఐకేపీ సీఐ సురేశ్, నాయకులు బండురావు తదితరులు పాల్గొన్నారు.

'బస్టాండుకు దారి కొనసాగించాలి'

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుకవైపు ఉన్న దారిని ప్రయాణికుల సౌకర్యార్థం కొనసాగించాలని మర్చెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ ప్రమోద్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీ అధికారులు దారి మూసే ప్రయత్నం చేస్తున్నారని, దీంతో బజార్‌వాడి, ప్రభుత్వాసుపత్రికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



అల్పాహారం అందిస్తున్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించినప్పుడే చదువుపై దృష్టి పెడతారన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. నాయకులు బొమ్మెన ప్రసాద్‌గౌడ్, ఉపాధ్యాయులు ఉదయ్‌బాబు, ధర్మపురి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన

వాంకిడి: నులి పురుగులు, సికిల్ సెల్ వ్యాధుల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి ఉప్రె వినయ్ అవగాహన కల్పించారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. హెచ్ఈవో రవిదాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాల రెండో జాబితా విడుదల

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన రెండో జాబితాను విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి జాబితా ప్రవేశాల తర్వాత వివిధ గ్రూపులలో మిగిలిన 81 సీట్లను భర్తీ చేయడానికి రెండో జాబితా విడుదల చేశామన్నారు. ఈనెల 19, 20వ తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. ఇచ్చిన గడువులోగా హాజరు కాని విద్యార్థుల సీట్లను రద్దు చేస్తామన్నారు.

మేఘమా.. వర్షించుమా..!



దహెగాంలో పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు



లింగాపూర్: సోయాబీన్ విత్తనాలు విత్తుతున్న కూలీలు

- వర్షాలు లేక అన్నదాతల్లో ఆందోళన
- విత్తనాలు విత్తినా మొలకెత్తని వైనం

దహెగాం/లింగాపూర్: మృగశిర కార్తె ప్రవేశించి పది రోజులు దాటిపోతోంది. కానీ వరుణుడు కరుణించడం లేదు. ఇప్పటి వరకు జిల్లాలోని దహెగాం, లింగాపూర్ మండలాల్లో భారీ వర్షమే పడలేదు. మృగశిర కార్తెలో విత్తనాలు విత్తుకుంటే పంటల దిగుబడి బాగా వస్తుందని అన్నదాతలు ఇది వరకే పొడి పొలాల్లోనే విత్తుకున్నారు. విత్తనాలు విత్తుకొని వాన కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. రోజూ మేఘావృతమై ఉంటున్నా వర్షం మాత్రం కురువడం లేదు. ఆదివారం దహెగాం మండలంలోని పలు గ్రామాల్లో చిరు జల్లులు కురిశాయి. మళ్లీ సోమ, మంగళవారాల్లో వర్షం లేకపోవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తక చెడిపోయే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దహెగాం మండలంలో..

వానాకాలం సీజన్‌లో ఈ ఏడాది దహెగాం మండల వ్యాప్తంగా 22 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. పొలాలను చదను చేసి ఇప్పటి వరకు మండలంలో సుమారు 90 శాతం పత్తి విత్తనాలు విత్తుకున్నారు. ఆదివారం మండలంలో చిన్నపాటి వర్షం కురువడంతో వర్షాలు వస్తాయని సంబురపడ్డారు. కానీ చిన్నపాటి వర్షం మాత్రమే కురువడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తక పాడైపోయే అవకాశాలు ఉన్నాయని వాపోతున్నారు. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేల రుపాయలు ఖర్చు చేశామని వర్షం రాకపోతే మరోసారి పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. విత్తనాలు, ఎరువులు, కూలీలకు అదనంగా ఆర్థిక భారమవుతుందని వాపోతున్నారు.

లింగాపూర్ మండలంలో..

లింగాపూర్ మండల వ్యాప్తంగా ఏటా 17,059 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. 3వేల ఎకరాల్లో సోయాబీన్ సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 90శాతం మంది రైతులు పత్తి, సోయా, కంది విత్తనాలు విత్తుకొని వర్షం పడితే మొలకెత్తుతాయని ఆశగా చూస్తున్నారు. కానీ మండలంలో ఎండలు మండిపోతుండడంతో పత్తి, ఇతర విత్తనాలు మొలకెత్తడం ప్రశ్నార్థకంగా మారింది. వానల కోసం మండలంలోని రైతులు దేవుళ్లకు పూజలు చేస్తున్నారు. మహిళలు ఆంజనేయస్వామి మందిరంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహిస్తున్నారు.

వరుణదేవుడి కరుణ కోసం..

మృగశిర కార్తె ప్రవేశించి పది రోజులు దాటుతున్నా నేటికీ భారీ వర్షాలు జాడ లేకపోవడంతో వరుణ దేవుడు కరుణించాలని గత నాలుగు రోజుల క్రితం దహెగాం మండలంలోని గిరవెల్లిలో పూజలు చేశారు. వర్షాలు లేనందున విత్తిన విత్తనాలు మొలకెత్తడం లేదు. అన్నదాతలు దేవునిపై భారం వేసి ఆకాశం వైపు చూస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా అతివృష్టి వల్ల నష్ట పోయిన రైతులు ఈ సీజన్‌లోనైనా పంటలు బాగా పండితే అప్పుల ఊబిలో నుంచి బయట పడతామని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

విత్తనాలు మొలకెత్తలేదు



నేను పోయిన వారమే ఐదు ఎకరాల్లో పత్తి పెట్టిన. విత్తనాలు విత్తినప్పటి నుంచి పెద్ద వాన పడలేదు. ఆదివారం చిన్నపాటి వర్షం పడింది. కానీ పెద్దగా వానలు లేకపోవడంతో విత్తనాలు ఇంకా మొలకెత్తలేదు. ఇప్పటికే వేల రుపాయలు ఖర్చయ్యాయి. వర్షం పడకుంటే తీవ్రంగా నష్టపోతా. మరోసారి విత్తనాలు విత్తుకోవాలంటే అప్పులు చేయక తప్పదు. వరుణదేవుడు కరుణించాలని ఆకాశం వైపు ఆశగా చూడడమే తప్పా ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది.

– మల్లేశ్, రైతు, దహెగాం

వర్షం కోసం ఎదురుచూస్తున్నాం



దుక్కులు దున్ని విత్తనాలు విత్తి వర్షం కోసం ఎదురుచూస్తున్నాం. నేను 10 ప్యాకెట్ల పత్తి విత్తనాలు వేసి సుమారు ఎనిమిది రోజులు పూర్తయినా వర్షం లేక మొలకలు కూడా రావడం లేదు. వర్షాలు పడితేనే పంటలు ఎదుగుతాయి. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

– జాదవ్ విలాస్, రైతు, లింగాపూర్

బడీడు పిల్లలు బడిలో ఉండాలి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: బడీడు వచ్చిన ప్రతీ విద్యార్థి బడిలో ఉండాలని, బడి బయట ఒక్కరు కూడా ఉండవద్దని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. మంగళవారం మండలంలోని రాంనగర్, రింగన్‌ఘాట్ గ్రామాల్లో చేపట్టిన బడిబాటలో పాల్గొని ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో చదివిన విద్యార్థులను గోయగాం ఉన్నత పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ప్రవీణ్, విష్ణువర్ధన్, భరత్‌రావు తదితరులు ఉన్నారు.

కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

వాంకిడి: మండల కేంద్రంలోని కేబీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కాలనీలోని కుంరం దౌలత్‌రావు ఇంటి నుంచి పెందుర్ లక్ష్మణ్ ఇంటి వరకు గల రోడ్డు పాదలతో అధ్వానంగా మారిందని వెంటనే సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలని, వర్షాలకు మురుగు నీరు ఇళ్లలోకి వచ్చే అవకాశాలు ఉన్నందున మురికికాలువల నిర్మాణం చేపట్టాలని, ఇంటింటికీ తాగునీటి సరఫరా ప్రారంభించాలని వినతిపత్రం ద్వారా కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో దుర్గం సందీప్, మల్కాడె గులాబ్, గుర్నులె మనోహర్ తదితరులు ఉన్నారు.

మరమ్మతులే గతి..!



చింతలమానెపల్లి: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు తాత్కాలిక భవనాలే దిక్కయ్యాయి. శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో నీరు ఉరుస్తుంది. దీంతో ప్లాస్టిక్ కవర్లను అతికించే విధానంలో ఎంపీడీవో కార్యాలయానికి పైకప్పుపై మరమ్మతులు నిర్వహిస్తున్నారు. భవనం గోడలు సైతం శిథిలావస్థలో ఉండడం గమనార్హం.

'భగీరథ' సర్వేలో ఎంఎస్, ఐకేపీ సీసీలు



సుల్తాన్‌గూడలో సర్వే చేస్తున్న సీసీ

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం మిషన్‌భగీరథ సర్వే కొనసాగింది. ఇప్పటి వరకు కేవలం గ్రామ పంచాయతీ కార్యదర్శులు సర్వే నిర్వహిస్తుండగా.. వారికి తోడుగా మండల సమాఖ్య, ఇందిరా క్రాంతిపథం సీసీలకు కూడా బాధ్యతలు అప్పగించారు. దీంతో సీసీలు సర్వే నిర్వహిస్తున్నారు. కెరమెరిలో ఐదుగురు, గోయగాంలో ముగ్గురు, క్లస్టర్ పరిధిలో మొత్తం 10 మంది సీసీలు సర్వే చేస్తున్నారు. మిషన్ భగీరథ నీరు వస్తుందా? ఎప్పుడు వస్తుంది? రోజులో ఎన్నిసార్లు వస్తుంది? మన్నిక ఎలా ఉంటుంది తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

దహెగాంలో మోస్తారు వర్షం



దహెగాంలో కురుస్తున్న వర్షం

దహెగాం: మండల కేంద్రంలో మంగళవారం గాలి దుమారంతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. వర్షం కురువడంతో వారసంతలో దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. రక్షణగా ఏర్పాటు చేసుకున్న టార్పాలిన్లు గాలికి కొట్టుకుపోవడంతో పలు దుకాణాల్లో సామగ్రి తడిసిపోయింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలు మోస్తారు వర్షంతో ఉపశమనం పొందారు. కాగా చిన్నపాటి వర్షం పడడం వల్ల పెద్దగా ప్రయోజనం లేదని రైతులు పేర్కొంటున్నారు.

వైద్యం కోసం ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దాతలు

బెజ్జూర్: మండలంలోని కుకుడ గ్రామపంచాయతీలో గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న దుర్గం దేవాజి వైద్య ఖర్చుల కోసం దాతలు ఆర్థికసాయం అందజేశారు. విరాళాల ద్వారా సేకరించిన రూ.లక్ష 5వేలను మంగళవారం బాధితుడికి అందజేశారు. అబ్దుల్ రహమత్, భాస్కర్ రాజు, ఖాజా మొయినుద్దీన్, తిరుపతి, జావిద్, శ్రీధర్‌చారి అమీరుద్దీన్, శ్రీనివాస్, ఆబిద్ ఖాన్, గుమ్ముల శ్రీనివాస్, తాజుద్దీన్, శ్రీనివాసాచారి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయుల బృందం

పెంచికల్‌పేట్: జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలకు (ఎన్ఎంఎంఎస్)కు పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జాడి మౌనిక, గోలేటి వంశిత అనే ఇద్దరు విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం విజయ నిర్మల మంగళవారం తెలిపారు. వీరికి ఏటా రూ.12వేల చొప్పున నాలుగేళ్లకు రూ.48 ఉపకార వేతనం అందనున్నట్లు ఆమె తెలిపారు. ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, శ్రీధర్, రమాదేవి, గంగాభవాని, భారతి తదితరులు పాల్గొన్నారు.

నిధులు రాక.. పనులు సాగక



ముకదంగూడలో అసంపూర్తిగా పంచాయతీ భవన నిర్మాణం

- అసంపూర్తిగా పంచాయతీ భవనాలు
- అద్దె గదుల్లో కొనసాగింపు
- నేటికీ విడుదల కాని బిల్లులు



సాకడలో నిలిచిన నిర్మాణం

కెరమెరి: నూతన గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని గత ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించలేదు. భవనాల మంజూరే తమ బాధ్యత అనుకున్న ప్రభుత్వం నిర్మాణాలకు నిధులు విడుదల చేయడం మరిచిపోయింది. ఫలితంగా ఏడాది గడుస్తున్నా బిల్లులు రాక గుత్తేదారులు పనులు నిలిపివేశారు. కాగా అనేక గ్రామ పంచాయతీలు అద్దె భవనాల్లో, పాఠశాలల ఆవరణల్లో, కమ్యూనిటీ హాళ్లలో కొనసాగుతున్నాయి. బడా గుత్తేదారులు తమ వద్ద ఉన్న డబ్బులు ఖర్చు చేసి భవనాలను నిర్మించినప్పటికీ.. లేని వారు ఇతరుల వద్ద అప్పులు చేసి భవనాల నిర్మాణాలు ప్రారంభించారు. కానీ ఇప్పటికి నయాపైసా విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.

15 భవనాలు మంజూరు

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉండగా 33,470 జనాభా ఉంది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అగర్‌వాడ, అంతాపూర్, బాబేఝరి, బోరిలాల్‌గూడ, గోండ్‌గూడ, ఝరి, కెస్లాగూడ, ముకదంగూడ, రింగన్‌ఘాట్, తుమ్మగూడ నూతన గ్రామ పంచాయతీలు మంజూరు కాగా, ఐటీడీఏ ఆధ్వర్యంలో సాకడ, ధనోరా, పార్డ, అనార్‌పల్లి, మెట్టపిప్రిలో భవనాలు మంజూరయ్యాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించిన నిధులు ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు మంజూరు కావాల్సి ఉంది. కానీ నేటికీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. అనేక చోట్ల బడా గుత్తేదారులు చిన్న చిన్న పనులు మినహా భవన నిర్మాణాలు పూర్తి చేస్తే మరికొన్ని స్లాబ్‌లెవల్‌లో పనులు నిలిచిపోయాయి. కాగా ఏడాది గడుస్తున్నా ఇప్పటికి ఒక్క భవనం కూడా ప్రారంభం కాలేదు. కాగా కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వంపై గుత్తేదారులు ఆశలు పెట్టుకున్నారు. అధికారులు స్పందించి చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

రూ.7 లక్షలు వెచ్చించా..



నూతన పంచాయతీ భవన నిర్మాణం కోసం ఇప్పటికే రూ.7లక్షలు వెచ్చించా. పిల్లర్లు వేసి బేస్‌మిట్ పనులు పూర్తయ్యాయి. కానీ ఇంత వరకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా అందించలేదు. ఇతరుల వద్ద అప్పులు చేసి మరీ వెచ్చించాను. ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేయాలి.

– పి.లింబాదాస్, ముకదంగూడ

మంజూరులో జాప్యం



గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. గుత్తేదారులకు బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతుంది. బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయో తెలియదు. మంజూరు కాగానే సమాచారం అందిస్తాం.

– స్టీవెన్, పీఆర్ఏఈ, కెరమెరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ కమలాకర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌లైన్‌లలో మరమ్మతులు, చెట్ల నరికివేత వల్ల అంతరాయం ఉంటుందన్నారు. పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీ ఏరియా, గుంటూరుకాలనీ, దాదానగర్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

స్వర్ణకార సంఘం ఏర్పాటు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణ నూతన స్వర్ణకార సంఘాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొజ్జ గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా వొజ్జకేశవుల రవికుమార్, కోశాధికారిగా ఏలేశ్వరం అఖిల్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా బ్రహ్మంచారి, ఉపాధ్యక్షులుగా గన్నవరం శ్రీధర్‌చారి, సహాయ కార్యదర్శిగా నర్సింగోజు రవిప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అభిలాష్, అశోక్ ఎన్నికయ్యారు. వారిని జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు శ్రీరాములు, పద్మాకర్, శ్రీనివాస్, సత్యనారాయణ అభినందించారు.

ఆరుగురి బైండోవర్

చింతలమానెపల్లి: మండలంలో నాటుసారా తయారు చేస్తున్న ఆరుగురిని మంగళవారం తహసీల్దార్ నాగరాజుగౌడ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. రణవెల్లి గ్రామానికి చెందిన లకావత్ రమేశ్, లంబాడిహేటి గ్రామానికి చెందిన అజ్మీర శివరాం, రాజు, అజ్మీర విజయ్, ధరావత్ కళావతి, ధరావత్ జమునాబాయిలు నాటుసారా తయారు చేస్తూ పలుమార్లు పట్టుబడినట్లు, మళ్లీ నేరాలకు పాల్పడకుండా బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్పీని సన్మానించిన 'అరిగెల'

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో గత 30 నెలల పాటు జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించి బాలానగర్ డీసీపీగా బదిలీపై వెళ్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో కమ్యునిటీ పోలీసింగ్ విధానాన్ని చేపట్టి ఇక్కడి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. జిల్లా పోలీసు అధికారిగా కాకుండా ప్రజల వ్యక్తిగా ప్రతీ ఒక్కరితో స్నేహపూర్వకంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్‌గౌడ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.